క్లుప్తంగా

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాకేశ్

పెద్దపల్లిరూరల్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేశ్ కోరారు. పెద్దపల్లిలో శనివారం విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.8700 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. స్కూళ్లు, కాలేజీ యాజమాన్యాల ఒత్తిడులు, బెదిరింపులతో విద్యార్థులు మానసిక వేదనకు గురవుతున్నారని, అలాంటి స్కూళ్లు, కాలేజీలను వెంటనే మూసేయాలని కోరారు. జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్, నగర కార్యదర్శి అజయ్, కోకన్వీనర్ సందీప్, అరవింద్ ఉన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

గోదావరిఖనిటౌన్: స్థానిక గోదావరిఖని ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న వాషింగ్, స్వీపింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు తోకల రమేశ్ డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు శనివారం విధులు బహిష్కరించి స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట తోకల రమేశ్‌తో కలిసి నిరసన చేపట్టారు. కాంట్రాక్ట్ కార్మికులు లక్ష్మీ, సంధ్య, కాంతమ్మ, రాజేశ్వరి, ప్రేమలత, జె.రమేశ్, మధుకర్, శివకుమార్, అక్రం పాల్గొన్నారు.

రేపు ఎస్టీ యువతకు ఇంటర్వ్యూ

పెద్దపల్లిరూరల్: విద్యావంతులైన నిరుద్యోగ ఎస్టీ (గిరిజన) యువతకు యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం జలాల్‌పూర్‌లోని స్వామి రామానందతీర్థ రూరల్ సంస్థలో సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి సంగీత తెలిపారు. ఆసక్తిగల గిరిజన యువత తమ ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, పాస్‌పోర్టు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. టెన్త్, ఇంటర్, బీకాం కంప్యూటర్, హార్డ్‌వేర్ అసిస్టెంట్ తదితర విద్యార్హతలున్న వారిని ఎంపిక చేసి 105రోజుల పాటు వృత్తి నైపుణ్యశిక్షణ ఇస్తారని వివరించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

పాలకుర్తి: మండలంలోని పుట్నూర్ గ్రామ శివారులో గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో రామ్మోహనచారి, ఎంపీవో సుదర్శన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు.

యూరియా అక్రమంగా నిల్వ చేస్తే కఠిన చర్యలు

రామగిరి: యూరియాను రైతులకు అందించకుండా గోదాముల్లో అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయశాఖ అధికారి చిందం శ్రీకాంత్ అన్నారు. మండలంలోని లొంకకేసారంలోని ఎరువుల దుకాణాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. గోదాముల్లో యూరియా నిల్వలు ఉన్నాయని రైతులు తెలిపిన సమాచారం మేరకు తనిఖీ నిర్వహించి నిల్వ ఉన్న 87 యూరియా బస్తాలను రైతులకు అందజేశారు. ఏఈవో అరవింద్ ఉన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు సవరించాలి

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల అధికారులు విడుదల చేసిన ఓటర్ల జాబితా తప్పుల తడకగా ఉందని బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి ఆరోపించారు. విచారణ జరిపి తప్పులు సవరించాలని తహసీల్దార్ పుల్లూరి జగదీశ్వర్ రావుకు, ఎంపీడీవో పూర్ణచందర్‌రావుకు శనివారం వేర్వేరుగా వినతిపత్రం అందించారు. బీఆర్ఎస్ నాయకులు మాదాసు చందు, ఒడ్నాల సీను, దేవయ్య, దర్ముల రవి, మానస ఉన్నారు.

ముగిసిన రామగుండం జోనల్‌స్థాయి క్రీడలు



క్రీడాకారులతో ఎంఈవోలు

జ్యోతినగర్: ఎస్‌జీఎఫ్ రామగుండం జోనల్ క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్ జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న క్రీడల ముగింపు కార్యక్రమంలో ఉమ్మడి రామగుండం ఎంఈవోలు మల్లేశం, ఏకాంబరం, విమల పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, పీడీలు మాధవి, జావిద్, సోమశేఖర్, తిరుపతి, ప్రకాశ్, నిర్మల, శ్రీనివాస్, సత్యం పాల్గొన్నారు.

మూడురోజులుగా వరద నీటిలోనే..



ఖానాపూర్ శివారులో నీట మునిగిన వరిపంట



ఎగ్లాస్‌పూర్‌లో నీట మునిగిన మహేందర్‌కు చెందిన పత్తి పంట

- వందల ఎకరాల్లో నీట మునిగిన వరి, పత్తి
- గోదావరి పరీవాహక ప్రాంతంలో తగ్గని వరద ఉధృతి
- ఆందోళనలో బాధిత రైతులు

మంథనిరూరల్: భారీ వర్షాలు, గోదావరి నది వరద ఉధృతి రైతులను నిండా ముంచాయి. మూడు రోజుల క్రితం గోదావరి నదికి భారీగా వరద నీరు చేరడంతో పరీవాహక ప్రాంతంలోని వందల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. మంథని మండలంలోని గోదావరి పరీవాహక ప్రాంతంలో మూడు రోజులుగా వరద ఉధృతి తగ్గకపోవడంతో పంటలన్నీ నీటిలోనే మునిగిఉన్నాయి. నీట మునిగిన వరి, పత్తి పంటలకు ఇక చేతికి రావని, పెట్టుబడులు వరదనీటి పాలయ్యాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పార్వతీ బ్యారేజీకి వరద తాకిడి...

ఎగువన కురుస్తున్న వర్షాలతో పాటు ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో మంథని మండలం సిరిపురం సమీపంలోని పార్వతీ బ్యారేజీకి వరద తాకిడి కొనసాగుతోంది. గురువారం నుంచి శనివారం వరకు వరద ఉధృతి అలాగే ఉంది. ఎగువ నుంచి వరద నీళ్లు బ్యారేజీకి చేరగా 74గేట్లు ఎత్తి అదే స్థాయిలో దిగువకు వదిలారు. దీంతో పరివాహక ప్రాంతంలోని పంట పొలాలన్నీ మునిగిపోయాయి.

ఆందోళనలో అన్నదాతలు

గోదావరి పరీవాహక ప్రాంతంలోని వందల ఎకరాల్లో వరి, పత్తి పంటలు నీట మునిగాయి. మంథని మండలంలోని ఉప్పట్ల, విలోచవరం, పోతారం, ఖానాపూర్, ఎగ్లాస్‌పూర్ గ్రామాల్లోని వందల ఎకరాలు నీటిలోనే ఉండిపోయాయి. మూడురోజులుగా నీటిలోనే ఉన్న వరి మురిగిపోయే అవకాశం ఉందని, పత్తి ఎర్రబారిపోతుందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలె



తొమ్మిది ఎకరాల్లో వరి పంట సాగు చేసిన. గోదావరి వరద నీళ్లు చేరి ఆరెకరాల్లో పంటంతా మునిగిపోయింది. మూడు రోజులుగా నీళ్లలోనే పంట ఉంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు. అధికారులు, ప్రభుత్వం ఆదుకోవాలె.

– పుట్ట రామయ్య, రైతు, ఖానాపూర్

పెట్టుబడి వరదపాలు



పది ఎకరాల్లో సాగు చేసిన వరి పొట్ట దశకు వచ్చింది. భారీ వర్షాలు, వరదతో పదెకరాలు నీళ్లలో మునిగిపోయాయి. చేతికందే సమయంలో చేజారిపోయింది. మరో 30గుంటల్లో పత్తి పంట నీట మునిగింది. పెట్టిన పెట్టుబడులన్నీ వరదపాలు అయినయ్.

– బొడ్డు మహేందర్, రైతు, ఎగ్లాస్‌పూర్

అవసరం మేరకే యూరియా కొనండి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

కోల్‌సిటీ: రైతులు అవసరం మేరకే యూరియా కొనుగోలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం రామగుండం, అంతర్గాం, పాలకుర్తి మండలాల వ్యవసాయ అధికారులతో యూరియా లభ్యత, పంపిణీపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. చిన్న, సన్నకారు రైతులందరికీ అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉండేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పెద్ద రైతులు యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడాలని సూచించారు. రైతుల అవసరాల మేరకు యూరియా అందుబాటులో ఉందని, రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదిస్తూ జిల్లాకు అవసరమైన యూరియా ఎప్పటికప్పుడు స్టాక్ తెప్పిస్తున్నామని పేర్కొన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సమావేశంలో మండలాల వ్యవసాయ అధికారులు బండి ప్రమోద్‌కుమార్, కల్వల సతీశ్, కొప్పుల ప్రకాశ్ పాల్గొన్నారు.

ఎస్‌వోటూ జీఎంకు సన్మానం



సన్మానిస్తున్న క్వాలిటీ జీఎం బైద్యా

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 ఏరియా ఎస్‌వోటూ జీఎంగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందనున్న అంజనేయప్రసాద్‌ను శనివారం సన్మానించారు. జీఎం కార్యాలయంలోని మీటింగ్‌హాల్‌లో సన్మానించారు. క్వాలిటీ జీఎం బైద్యా, సివిల్ ఏజీఎం నాగేశ్వర్‌రావు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



రామగిరి: సన్మానిస్తున్న ఎంఈవో విజయ్‌కుమార్

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల, రొంపికుంట జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన సంటి నంబయ్య, పరిమిళదేవిని శనివారం పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని సన్మానించారు. ఎంఈవో ఇల్లందుల విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు రాజేశ్వరరావు, రజిని వందన, రమేశ్, సతీశ్, రజితకుమారి, రొంపికుంట మాజీ సర్పంచ్‌లు కట్కకం రవీందర్, కుందారపు బాపు, నాయకులు ఉప్పరి శ్రీనివాస్, గుమ్మడి సతీశ్ పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన నాగభూషణం శనివారం ఉద్యోగ విరమణ పొందారు. మండల విద్యాధికారులు సరస్వతి, ధర్మారం ప్రభాకర్, ఎలిగేడు నరేంద్రచారి పాల్గొన్నారు.

మంత్లీగ్రేడ్ ఉద్యోగుల పదోన్నతికి గ్రీన్‌సిగ్నల్

గోదావరిఖని: మంత్లీగ్రేడ్ ఉద్యోగులకు సమయానుకూలంగా వచ్చే పదోన్నతికి డైరెక్టర్(పా) అంగీకరించినట్లు గుర్తింపు యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. శనివారం డైరెక్టర్(పా)తో జరిపిన చర్చల మేరకు పదోన్నతికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. సెప్టెంబర్ 1 నుంచి క్లరికల్, మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్‌మెన్, సర్వేయర్లతో పాటు మంత్లీ గ్రేడ్ ఉద్యోగులకు ఈ పదోన్నతి వర్తించనున్నట్లు వివరించారు. దీని ద్వారా సంస్థవ్యాప్తంగా 360మందికి పదోన్నతి ప్రయోజనం చేకూరనుందన్నారు.

ఈఅండ్ఎం డైరెక్టర్‌గా తిరుమల్‌రావు

గోదావరిఖని: సింగరేణి సంస్థ ఎలక్ట్రికల్అండ్ మెకానికల్(ఈఅండ్ఎం) డైరెక్టర్‌గా ఎం.తిరుమల్‌రావును నియమిస్తూ యాజమాన్యం శనివారం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ఈఅండ్ఎం డైరెక్టర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణరావు ఈనెలాఖరున ఉద్యోగ విరమణ పొందనుండటంతో ఆయన స్థానంలో తిరుమల్‌రావును నియమించారు. రెండేళ్లపాటు ఈఅండ్ఎం డైరెక్టర్‌గా కొనసాగనున్నారు. ఈనెల 29న జరిగిన సమావేశంలో డైరెక్టర్ ఎంపిక చేసినట్లు యాజమాన్యం ప్రకటించింది.

ఉద్యోగి జీవితంలో బదిలీలు సహజం

రామగిరి: ఉద్యోగి జీవితంలో బదిలీలు సహజమని ఏఐటీయూసీ ఆర్జీ–3 బ్రాంచ్ సెక్రటరీ ఎం.రాంచంద్రారెడ్డి అన్నారు. ఎస్అండ్‌పీసీ కార్యాలయంలో ఆర్జీ–3లో విధులు నిర్వహించి బదిలీపై జమేదారులుగా వెళ్తున్న పోగుల అర్జున్, దగ్గుల శ్రీనివాస్‌ను, అలాగే ఆర్జీ–3 ఏరియాకు బదిలీపై వచ్చిన కందుల సదయ్య, కుమార్‌స్వామిని శనివారం సన్మానించారు. అదేవిధంగా ఉద్యోగ విరమణ పొందిన సత్యనారాయణను సన్మానించారు. పిట్ సెక్రటరీ శ్రీనివాసరాజు, గౌరవ అధ్యక్షుడు నూనె కొమురయ్య, నాయకులు జి.రాజేందర్, ఎం.రమేశ్, ఎ.వెంకటేశ్వర్లు, గొట్టె రాంచందర్ తదితనేలే పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• కమీషన్లకు కేరాఫ్ పుట్ట మధు

కమాన్‌పూర్: కమీషన్లకు కేరాఫ్ అడ్రస్ మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.ఎస్.అన్వర్, పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర మంత్రిగా అవినీతి, అక్రమాలకు తావులేకుండా సేవలందిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబుపై మరోసారి విమర్శలు చేస్తే తగిన గుణపాఠం చెప్తామన్నారు. సమావేశంలో ఏఎంసీ డైరెక్టర్లు అబ్దుల్ రఫీక్, దాసరి గట్టయ్య, నాయకులు మల్యాల తిరుపతి, గడుప కృష్ణమూర్తి, కిషన్‌రెడ్డి, అంబీరు శ్రీనివాస్, ముస్తాక్, మల్యాల మహేశ్, తీగల రాజయ్య, ఇక్బాల్ పాల్గొన్నారు.

• అమలుకాని హామీలిచ్చి మోసం చేశారు

కమాన్‌పూర్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రజలకు మోసపూరిత హామీల్చి అధికారంలో వచ్చిందని బీఆర్ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్ ఆరోపించారు. మండలంలోని సిద్దిపల్లెలో నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు సభ్యుని నుంచి జెడ్పీటీసీ వరకు బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని నాయకులు, కార్యకర్తలకు ఆయన సూచించారు.

• మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

సుల్తానాబాద్‌రూరల్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని కార్యదర్శి రాధ అన్నారు. మండలంలోని కనుకులలో గ్రామ స్వరాజ్య సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా శనివారం కార్యదర్శి ప్రారంభించారు. సంస్థ కోఆర్డినేటజర్ ధనలక్ష్మి, మండల ట్రైనర్ బండారి మమత మాట్లాడుతూ ఈ సంస్థ ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి 50శాతం సబ్సిడీపై మిషన్లు అందించనున్నట్లు తెలిపారు.

• నిబంధనలు పాటించని ఇంటి నిర్మాణంపై ఫిర్యాదు

జూలపల్లి: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఇచ్చిన అనుమతి ప్రకారం, నిబంధనలు పాటించక నిర్మించిన ఇంటిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేశ్ డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎంపీడీవో పద్మజకు శనివారం వినతిపత్రం సమర్పించారు.

• ఓటరు జాబితాపై సమావేశం

జూలపల్లి: నూతనంగా సవరించిన ఓటరు జాబితాపై శనివారం ఎంపీడీవో పద్మజ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల బాధ్యులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో తప్పులు ఉంటే సూచించాలన్నారు.

• ఎన్నికల నిర్వహణపై అవగాహన

ముత్తారం: ముత్తారం ఎంపీడీవో కార్యాలయంలో శనివారం రాజకీయ పార్టీల నాయకులకు స్థానిక ఎన్నికల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రానున్న స్థానిక ఎన్నికల ఏర్పాట్లపై ఎంపీడీవో నాయకులతో చర్చించారు.

• నర్సాపూర్‌లో టీబీ ఎక్స్‌రే పరీక్షలు

ఎలిగేడు: మండలంలోని నర్సాపూర్ జీపీ కార్యాలయంలో శనివారం టీబీ ఎక్స్‌రే క్యాంపును మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని 102మందికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఎంపీవో కిరణ్, సూపర్‌వైజర్లు నాగమణి, లక్ష్మన్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

• రైతులకు యూరియా పంపిణీ

పాలకుర్తి: మండల పరిధిలోని రైతులకు శనివారం 30మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ తెలిపారు. పుట్నూర్‌లోని డీసీఎంఎస్, కన్నాల సింగిల్‌విండోతో పాటు కుక్కలగూడుర్ ఓంసాయి ఫర్టిలైజర్స్ షాపు ద్వారా రైతులకు ఎకరానికి ఒక బస్తా చొప్పున యూరియా పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

• రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

ఓదెల: మండలంలోని కొలనూర్ నుంచి అంకంపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ నాయకుడు పాకాల కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు ఎమ్మెల్యే విజయరమణరావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు.

• ఎన్టీపీసీ పీటీఎస్ స్క్రాప్ చోరీపై కేసు నమోదు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్ నుంచి అక్రమంగా తరలిస్తున్న స్క్రాప్ మెటీరియల్ చోరీ చేసిన ఘటనపై ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై టి.ఉదయ్‌కిరణ్ వివరాల ప్రకారం పర్మినెంట్ టౌన్‌షిప్ గుప్త కన్‌స్ట్రక్షన్‌కు చెందిన ఇనుప వస్తువులు చోరీకి గురైనట్లు సంస్థ ప్రతినిధి రంగ భానుప్రకాశ్ ఫిర్యాదు చేశాడు. దీంతో ఎన్టీపీసీ సీఐఎస్ఎఫ్ సిబ్బంది నిందితులను అదుపులోకి తీసుకుని ఎన్టీపీసీ హెచ్ఆర్ అధికారులకు అప్పగించారు. ట్రాక్టర్ డ్రైవర్ ఎ.సతీశ్, హైడ్రా డ్రైవర్ గుడ్డు కుమార్‌సింగ్, క్రేన్ ఆపరేటర్ కబీర్ అన్సారీపై కేసు నమోదు చేయడంతో పాటు ట్రాక్టర్, హైడ్రాను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

మొక్కలు నాటిన ఎన్టీపీసీ ఉద్యోగులు



ఉద్యోగుల కుటుంబ సభ్యులతో ఈడీ చందన్‌కుమార్ సామంత

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో పనిచేసి ఉద్యోగ విరమణ పొందుతున్న ఉద్యోగులతో ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సామంత శనివారం మొక్కలు నాటించారు. ఎన్టీపీసీ రామగుండం పీటీఎస్‌లోని పార్కులో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందుతున్న వెంకటేశ్వర్లు, రవీందర్‌రెడ్డి, విష్ణుదేవరావు, ఎస్.ఎస్‌రావు, రాజేశ్వర్, రంగారావు, కనకయ్య కుటుంబసభ్యులతో కలిసి మొక్కలు నాటారు. ఉద్యోగ గుర్తింపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణయ్య, జనరల్ సెక్రటరీ రాజేశ్వర్ పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పనిసరి



సన్మానిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు



రామగిరి: సన్మానిస్తున్న జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వరరావు

రామగిరి: ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పనిసరి అని ఐఎన్‌టీయూసీ ఆర్జీ–3 ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి అన్నారు. ఆర్జీ–3 ఏరియా ఎస్అండ్‌పీసీ సిబ్బంది పొట్లపెల్లి సత్యనారాయణ ఉద్యోగ విరమణ పొందగా శనివారం ఐఎన్‌టీయూసీ నాయకులతో కలిసి సన్మానించారు. సెక్యూరిటీ ఇన్‌చార్జి కారుపాకల సుధాకర్, పిట్ సెక్రటరీ గోపతి రమేశ్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ కుమారస్వామి, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం

ఆర్జీ–3 ఏరియాలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి ఆదివారం ఉద్యోగ విరమణ పొందుతున్న అధికారులకు, ఉద్యోగికి జీఎం కార్యాలయంలో శనివారం ఆత్మీయ సన్మానం నిర్వహించారు. పర్చేజ్ విభాగం డీజీఎం పీ.డీ.సుధాకర్, ఆర్జీ–3 విభాగం జూనియర్ ఆఫీసర్ అడ్మినిస్ట్రేషన్ మిర్యాల రాజిరెడ్డి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ డి.శ్రీనివాసవర్మను ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు నరేంద్ర సుధాకరరావు, కొలిపాక నాగేశ్వరరావు సన్మానించారు. ప్రాతినిధ్య సంఘం ప్రతినిధి రవికుమార్, అధికారుల సంఘం అధ్యక్షుడు సీహెచ్.వెంకటరమణ, ఏరియా ఇంజనీర్ కె.యాదయ్య, ఎస్‌వోటూ జీఎంలు ఎం.రాంమోహన్ బండి సత్యనారాయణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ భానుప్రసాద్‌రావు, విభాగాధిపతులు బి.వి.సత్యనారాయణ, బి.సుదర్శనం, కె.చంద్రశేఖర్, సి.జె.సురేఖ, నాగేశ్వరరావు, ఆర్.రాజేశ్వరి, మేఘన పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపొందించేందుకే క్విజ్‌పోటీలు



ధర్మారం: విజేతలతో ఎంఈవో, ఉపాధ్యాయులు

కాల్వశ్రీరాంపూర్: విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేదుకే క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో సిరిమల్ల మహేశ్‌కుమార్ అన్నారు. కాల్వ శ్రీరాంపూర్ జెడ్పీహైస్కూల్లో శనివారం మండలస్థాయి మ్యాథ్స్, సైన్స్ క్విజ్‌పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈవో ప్రశంసా పత్రాలు అందించారు.

ఎలిగేడు: మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి గణితం, సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను ఎంఈవో నరేంద్రచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు ఎంఈవో నరేంద్రచారి సర్టిఫికెట్లు అందజేశారు.

ధర్మారం: క్విజ్ పోటీలు నిర్వహించడంతో విద్యార్థుల్లో ప్రతిభ వెలుగులోకి వస్తుందని ఎంఈవో ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయిలో గణితం, సామాన్యశాస్త్రం సబ్జెక్టులపై క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు మండల విద్యాధికారి సర్టిఫికెట్లు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షీలా, రిసోర్సు పర్సన్‌లు కృష్ణమోహన్, విజయ్, రఘురాంరెడ్డి పాల్గొన్నారు.

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోకి పొట్యాల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు శనివారం అంతర్గాం హైస్కూల్‌లో జరిగిన మండల స్థాయి సైన్స్, గణిత క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. దీంతో వారు జిల్లాస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం గద్దె శ్రీనివాస్ తెలిపారు. విజేతలు గుమ్ముల హర్షిత, తోకల వర్షిణి, తోకల అశ్వినిని ఎంఈవో ఏకాంబరం అభినందించారు.

ముత్తారం: ముత్తారం జెడ్పీ పాఠశాలలో శనివారం నిర్వహించిన గణిత, సైన్స్ మండలస్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంపీడీవో సురేశ్, ఎంఈవో హరిప్రసాద్ అభినందించారు.

జూలపల్లి: మండల కేంద్రంలో గణితం, సైన్స్ క్విజ్ పోటీలను ఎంఆర్‌సీ భవనంలో ప్రాథమికోన్నత, సెకండరీ స్థాయి పాఠశాలల విద్యార్థులకు నిర్వహించారు. తొమ్మిది మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో సరస్వతి తెలిపారు.

ప్రత్యేక పూజలు, అన్నదానం



జ్యోతినగర్: కుంకుమ పూజల్లో మహిళలు



సుల్తానాబాద్: వినాయక మండపం వద్ద పూజలు



కమాన్‌పూర్: గుండారంలో..



ఓదెల: హరిపురంలో కుంకుమపూజ



రామగుండం: పూజల్లో పాల్గొన్న భక్తులు



పాలకుర్తి: కృష్ణానగర్‌లో అన్నదానం

జ్యోతినగర్/రామగుండం/జూలపల్లి/సుల్తానాబాద్/ఓదెల/కమాన్‌పూర్/పాలకుర్తి/రామగిరి: గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా జిల్లాలోని వినాయక మండపాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించారు. కుంకుమపూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

నిబంధనల ప్రకారం భూసేకరణ చేపట్టాలి

జైపూర్: సింగరేణి పరిధిలో భూసేకరణ ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలని సింగరేణి సంస్థ సిబ్బంది, పరిపాలన, సంక్షేమ విభాగం డైరెక్టర్ గౌతమ్ పొట్రు అన్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలోని ఎస్టీపీపీ ప్రాణహిత అతిథి గృహంలో శనివారం మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్లు, ఎస్టేట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డైరెక్టర్ మాట్లాడుతూ భూ యజమానులు, సింగరేణి సంస్థ సమన్వయంతో వ్యవహరించాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా భూసేకరణ ప్రకియ నిర్వహించాలని సూచించారు.

విద్యాసంస్థల్లో ర్యాగింగ్ అరికట్టాలి

గోదావరిఖనిటౌన్: విద్యాసంస్థల్లో ర్యాగింగ్ రక్కసిని అరికట్టాలని, ఆ దిశగా ప్రతీఒక్కరు పాటుపడాలని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే జైలు శిక్షతో పాటు, విద్యాసంస్థల నుంచి సస్పెండ్ కాక తప్పదన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.రవీందర్, ఉపన్యాసకులు మంతెన శ్రీనివాస్, న్యాయవాది ఎండీ ఉమర్ తదితరులు పాల్గొన్నారు.